క్లుప్తంగా

గాయత్రీ దేవిగా అమ్మవారి అలంకరణ


హారతి ఇస్తున్న అర్చకుడు

నల్లగొండ : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని మంగళవారం గాయత్రీ దేవిగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పాయసం, పులిహోర నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి అంబటి నాగిరెడ్డి, అర్చకులు చిలకమర్రి శ్రవణ్ కుమారాచార్యులు, గాదె ఉమామహేశ్వరరావు, దామోదర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు రాజీలేని పోరాటం చేస్తాం

నల్లగొండ : సీపీఎస్ రద్దు కోసం రాజీలేని పోరాటం చేస్తామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ అన్నారు. రిటైర్డ్ సీపీఎస్ ఉద్యోగుల గోడు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్లగొండ పట్టణంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానం వల్ల రిటైర్డ్ అయిన ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎస్ ఉద్యోగులుగా పనిచేసి రిటైర్డ్ అయి మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి వారి గోడు తెలుసుకుంటున్నామని తెలిపారు.

కమిషనర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న వర్షిత్‌రెడ్డి

నల్లగొండ : ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా నల్లగొండ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట వీరెల్లి చంద్రశేఖర్, పకీర్ మోహన్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి, గడ్డం మహేష్, మిర్యాల వెంకన్న, బీపంగి జగ్జీవన్, నీరజ, మంగళపల్లి కిషన్, కటకం శ్రీధర్ ఉన్నారు.


ఉచిత వైద్య శిబిరం

నల్లగొండ టౌన్: ఆయుర్వేదానికి మూల పురుషుడు ధన్వంతరి జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలో మంగళవారం ధన్వంతరి చిత్రపటానికి బీజేపీ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయుష్ డిపార్టుమెంట్ ఆయుర్వేద డిస్పెన్సరీ ఆధ్వర్యంలో నల్లగొండలోని 8,9 వార్డుల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. సుమారు 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుహాసిని సోలోమన్, డీపీఎం కే.కళ్యాణ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రుచిత, ఫార్మసిస్ట్ మారబోయిన చంద్రయ్య, యోగా ఇన్‌స్ట్రక్టర్లు మంజునాథ్, శ్రీవాణి, సింగం పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో రోగులకు దంత పరీక్షలు

మర్రిగూడ : స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మర్రిగూడ మండల కేంద్రంలోని 30 పడకల సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో మంగళవారం రోగులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి శాలిని మాట్లాడుతూ వైద్య పరీక్షలు మరో పది రోజులపాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, వైద్యులు దీపక్, మనోవాణి, అరుణతార, ప్రత్యూష, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కీర్తి పురస్కారం అందుకున్న ప్రొఫెసర్ రఘు


పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ రఘు

నల్లగొండ : నల్లగొండ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రఘు మంగళవారం తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం అందుకున్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలు అందించినందుకుగాను వచన కవిత్వం విభాగంలో వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు చేతులమీదుగా రఘు కీర్తి పురస్కారం అందుకున్నారు. అదేవిధంగా నల్గొండ పట్టణానికి చెందిన ప్రముఖ కవి బైరెడ్డి కృష్ణారెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం 2024 అందుకున్నారు.

సొంత భవనాలు లేక అవస్థలు

- అంతంత మాత్రంగానే సౌకర్యాలు
- ఇబ్బంది పడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు
- సొంత భవనాలు నిర్మించాలని వేడుకోలు

కేతేపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కేంద్రాలకు సొంత భవనాలు లేక, అద్దె భవనాల్లో వసతులు లేక నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో చిన్నారులను ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు వారి తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు.

కేతేపల్లి మండలంలో ఇలా..

కేతేపల్లి మండలంలో 40 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 180 మంది గర్భిణులు, 157 మంది బాలింతలు, 6 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులు 841 మంది, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలు 682 మంది ఉన్నారు. వీటిలో కేవలం 17 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా.. మిగిలిన వాటికి భవనాలు లేవు. 7 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరో 16 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయ భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాల్లో నిర్వహిస్తున్నారు, అద్దె భవనాలకు చెల్లిస్తున్న


కేతేపల్లిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

కిరాయి అతంత మాత్రంగానే ఉండడం, అవికూడా సక్రమంగా చెల్లించకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను అద్దెకు ఇచ్చిన యజమానుల నుంచి ఆయా కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మరుగుదొడ్లు లేకపోవడంతో..

అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు వంటివి లేకపోవడంతో కేంద్రాలకు వస్తున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనాలు ఇరుకుగా ఉండడంతో చిన్నారులను ఆరుబయట కూర్చో బెట్టి విద్యాబుద్ధులు నేర్పాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడంతో చిన్నారులు ఆరుబయట మలమూత్ర విసర్జన చేస్తున్నారు. ఫలితంగా కేంద్రాల పరిసరాలు అపరిశుభ్ర వాతావరణంతో నిండిపోతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి అంగన్‌వాడీ కేంద్రాలకు సౌకర్యాలతో కూడిన పక్కా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనంలో సరైన వసతులు లేక నిర్వహణ ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం నుంచి వచ్చిన పౌష్టికాహారాన్ని నిల్వ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. సొంత భవనం నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, కేతేపల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం

సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. నివేదికల ఆధారంగా నాలుగు కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధుల మంజూరయ్యాయి. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అన్ని కేంద్రాల్లో వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కళావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నకిరేకల్ : పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ అశ్రు అంజుమ్ అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా ఉపయోగిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ స్వరూపరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదారాణి, పద్మావతి, అరుణశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆకు కూరల్లో అధిక పోషకాలు

మునుగోడు: ఆకు కూరల్లో అధికంగా పోషకాలు ఉంటాయని, గర్భిణులు, బాలింతలు అధికంగా ఆకు కూరలు తినాలని ఏసీడీపీఓ వెంకటమ్మ సూచించారు. పోషణ మాసంలో భాగంగా మంగళవారం చీకటిమామిడి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం బంకమట్టి, తాటి ఆకులతో గర్భిణులు, బాలింతలకు వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివేష, అంగన్‌వాడీ టీచర్ విజయ, ఆయా ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.


మునుగోడు : అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చండూరు : గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని మునుగోడు ప్రాజెక్ట్ సీడీపీఓ లావణ్య కుమారి అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. స్థానికంగా పండించే ఆకు కూరలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, పల్లె దవాఖాన వైద్యుడు భాస్కర్, ఏఎన్‌ఎంలు ముబీన, కవిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

నల్లగొండ: దేశంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయి స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా నల్లగొండలో మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. బ్యాంకు సిబ్బందికి వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బ్యాంకు రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో 62 శాఖల్లో రూ.4800 కోట్లతో రైతులకు, మహిళలకు, వ్యాపారులకు, గృహ కొనుగోలుదారులకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు, బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ దేవందర్, ఎస్ఎంఓ సీహెచ్ వెంకటేశ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తంటాలు


శాలిగౌరాంలో యూరియా కోసం క్యూకట్టిన రైతులు

నకిరేకల్ : యూరియా కష్టాలు రైతులను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. రోజులు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. శాలిగౌరారం మండలానికి మంగళవారం 1110 బస్తాలు యూరియా వచ్చింది. అందులో శాలిగౌరారంలో పీఏసీఎస్‌కు 444 బస్తాలు, ఆకారంలో ఓ ఎరువుల షాపుకు 222 బస్తాలు, పెర్కకొండారంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రానికి 444 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే ఆయా కేంద్రాల వద్ద యూరియా కోసం భారీగా క్యూలైన్లు కట్టడంతోపాటూ చెప్పులు క్యూలైన్‌లో పెట్టారు. మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి సిబ్బందితో అక్కడకు చేరుకుని శాలిగౌరారంలో రైతుకు రెండు బస్తాల చొప్పున, ఆకారం, పెర్కకొండారంలో రైతుకు ఒక బస్తా చొప్పున అందించారు. అనేక మంది రైతులు యూరియా అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగిపోయారు.

జేసీబీ పట్టివేత

నల్లగొండ : కనగల్ మండలం బుడుమర్లపల్లి వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న జేసీబీని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు వెళ్లగా జేసీబీ పట్టుబడిందని ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

పత్తి రైతులకు నష్టపరిహారం అందించాలి

మర్రిగూడ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి చేలు ఎర్రబారిపోతున్నాయని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం మర్రిగూడ మండలంలోని సరంపేట, దామెరభీమనపల్లి, వట్టిపల్లి, బట్లపల్లి గ్రామాల్లో ఎర్రబారిన పత్తి చేలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎకరానికి రూ.25వేల నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారి ఐలయ్య, బండ శ్రీశైలం, సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, కొట్టం యాదయ్య, నీలకంఠం రాములు, సల్వోజు రామలింగాచారి, ఏరుకొండ రాఘవేంద్ర, చెల్లం ముత్యాలు, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


వట్టిపల్లిలో పత్తిచేలను పరిశీలిస్తున్న నాయకులు

అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

నకిరేకల్ : అన్ని వర్గాల అభివృద్ధికి బహుజన సమాజ్ పార్టీ కట్టుబడి ఉంటుందని బీఎస్పీ జోనల్ కోఆర్డినేటర్ కత్తుల కాన్షీరామ్ అన్నారు బహుజన సమాజ్ పార్టీ నకిరేకల్ నియోజవర్గ సమావేశం సోమవారం నార్కట్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను కాన్షీరామ్ ఆవిష్కరించి మాట్లాడారు. అంతకు ముందు ర్యాలీగా పార్టీ కార్యకర్తలు సమావేశానికి తరలివచ్చారు. అతర్‌సింగ్, సురేష్ ఆర్య, దయానంద్ రావు, మంతపురం బాలన్న, ఇబ్రహీం, శేఖర్, శివరామకృష్ణ, చంద్రశేఖర్, శ్రీకాంత్ మంచాల, రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత


ఆర్థిక సహాయం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీశైలం అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శ్రీశైలం కుటుంబాన్ని పరామర్శించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, మక్కెన అప్పారావు, మాదరగోని యాదయ్య, దాం యాదయ్య, జీడిమెట్ల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నకిరేకల్ : శాలిగౌరారం మండలంలోని అడ్లూరు గ్రామంలో ఐదుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2,07,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం శాలిగౌరారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గూని వెంకటయ్య, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బోడ అరుణ్‌కుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు భూపతి అంజయ్య పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేత

నకిరేకల్ : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నకిరేకల్ పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో వాసవి క్లబ్, వనితా, కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ ఐపీసీ దేవరశెట్టి సత్యనారాయణ, జోన్ చైర్మన్ గుండా నరేందర్, ఆలయ చైర్మన్ కోటగిరి శ్రీనివాస్, ఆయా క్లబ్‌ల అధ్యక్షులు గుడిపాటి రవి, కందగట్ల శ్వేత, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై కళా ప్రదర్శన

నకిరేకల్ : హెచ్ఐవీ ఎయిడ్స్, సుఖవ్యాధుల నిర్మూలన, రక్తదాన ప్రాముఖ్యతపై నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనాపూర్ గ్రామంలో మంగళవారం శ్రీసాయి అకాడమి ఆధ్వర్యంలో పల్లెసుద్దులు కళారూపం ద్వారా కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ అధికారి సుధాకర్, లక్ష్మి పాల్గొన్నారు.

‘ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు కరువయ్యాయి’

మునుగోడు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన మందులు కరువయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లం మహేష్ ఆరోపించారు. మంగళవారం మునుగోడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీవైఎఫ్ఐ నాయకులు సందర్శించి రోగులతో మాట్లాడారు. మునుగోడులో 50 పడకల ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి నరేష్, యాట శ్రీకాంత్, యాదయ్య, బొందు శివ, మహేష్ పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లో త్వరలో జరుగనున్న ఐద్వా జాతీయ మహాసభలు ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ కోరారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జాతీయ మహాసభల కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు.

చిట్యాల: ఐద్వా జాతీయ మహాసభల ప్రచార పోస్టర్‌ను ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ చిట్యాలలో మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు చెన్నోజు నాగమణి, పన్నాల శశికళ, మేడి సరిత, లావణ్య, మమత, కల్పన, అనిత పాల్గొన్నారు.

తిప్పర్తి : ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలో ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. ఉమ, భార్గవి, విజయలక్ష్మి, ఝాన్సి, మల్లేశ్వరి, రాములమ్మ పాల్గొన్నారు.

మంత్రికి వినతి

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలో నిర్మించిన 552 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇప్పించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పోరాట కమిటీ కన్వీనర్ అవుట రవీందర్, తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, ఉట్కూరి మధుసూదన్‌రెడ్డి, గంజి నాగరాజు, గంజి రాజేష్, విశాలాక్షి పాల్గొన్నారు.

టీఆర్‌పీతోనే బడుగులకు రాజ్యాధికారం సాధ్యం

కేతేపల్లి: తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టీఆర్‌పీ)తోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య అన్నారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 50 మంది నాయకులు కార్యకర్తలు మంగళవారం వట్టె జానయ్య సమక్షంలో టీఆర్‌పీలో చేరారు. వారికి వట్టె జానయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. టీఆర్‌పీలో చేరినవారిలో చిమట ఉపేందర్, కోట పూర్ణచందరావు, కోట వీరయ్య, వెంబడి రమేష్, వెంబడి చిరంజీవి, నాగేశ్వరరావు, సతీష్ ఉన్నారు.

‘విమర్శలు కాదు.. అభివృద్ధి చేయాలి’

చండూరు : విమర్శలు చేస్తూ కాలయాపన చేయడం కంటే.. అభివృద్ధి చేసి చూపించాలని చండూరు మండల మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కర్నాటి వెంకటేశం కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి అన్నారు. మంగళవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన పనులే తప్ప.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావొస్తున్నా ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. మాజీ వైస్ ఎంపీపీ అవ్వారు శ్రీనివాస్, గొరిగ సత్తయ్య, కర్నాటి అశోక్, హనుమంతు, కిశోర్, అంజయ్య, కృష్ణయ్య, అబ్బయ్య, అయోధ్య, మల్లేశం, ఆనంద్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు


వేడుకల్లో పాల్గొన్న ఎంజీయూ విద్యార్థులు


డీసీహెచ్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ పూజలు చేస్తున్న డాక్టర్ మాతృ, పాల్గొన్న వైద్య సిబ్బంది


యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో..


మెప్మా ఆధ్వర్యంలో


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నల్లగొండ : నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను మంగళవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి, మెప్మా, జిల్లా కార్మిక శాఖ, జిల్లా క్రీడలు, యువజన అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రజలు భారీ సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ ఆలీ, ఆయా శాఖల అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు.

ఎంజీయూలో బతుకమ్మ వేడుకలు

నల్లగొండ : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆవరణలో మంగళవారం ఏబీవీపీ ఎంజీయూ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, విష్ణు, ప్రమోద్, ఛత్రపతి, హనుమాన్, మోహన్, ప్రత్యూష, వెంకటేష్, విజయ్, సాయి, మానేష్, రాజేష్ పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్: భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలనే జీఓ నంబర్ 12 ను ప్రభుత్వం సవరించి, కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లగొండలోని లేబర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్మాణ రంగ కార్మికులందరికీ హెల్త్‌కార్డులు ఇవ్వాలని, గడువు దాటిన 12 లక్షల కార్డులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. కంచి కేశవులు, అవుట రవీందర్, సల్వోజు సైదాచారి పాల్గొన్నారు.

అభినవ్ విగ్రహ ఏర్పాటుకు కృషి

నల్లగొండ : పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో మేకల అభినవ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈఓ ఎంపీ.గోనారెడ్డి అన్నారు. మేకల అభినవ్ 24వ వర్ధంతి సందర్భంగా ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి గోనారెడ్డి హాజరై అభినవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకల అభినవ్ చిన్న వయసులోనే చెస్‌లో అసాధారణ ప్రతిభ చూపించాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొసనం కరుణాకర్‌రెడ్డి, డీఎస్‌డీఓ అక్బర్ అలీ, చెస్ ఆర్బిటర్ మేడం విశ్వప్రసాద్, తీగల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు


నకిరేకల్ : పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం-పుష్ప దంపతులు

సొసైటీలకు భూములు కేటాయించాలి

చిట్యాల: గీతా పారిశ్రామిక సొసైటీలకు జీవో 560 ప్రకారం ఐదెకరాల చొప్పున భూమి కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చొగోని సీతారాములు డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన కల్లుగీత కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మామిడి హన్మంతు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనగుళ్ల అచ్చాలు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, గునుకుంట్ల కృష్ణయ్య, బూరుగు శ్రీను, ఊడుగు సత్తయ్య పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని సంతకాల సేకరణ

చిట్యాల: మండలంలోని పేరేపల్లి గ్రామం మీదుగా వివిధ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆ గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ మునుగోడు, పలివెల, ఇప్పర్తి, కిష్టాపురం గ్రామాల మీదుగా చిట్యాల మండలంలోని పేరేపల్లి, బొంగోనిచెర్వు, వెలిమినేడు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, మండల ఉపాధ్యక్షుడు కూనూరు గణేశ్, గోలి సాయికిరణ్, శివగాని కరుణాకర్, అంజయ్య, యాదయ్య, పవన్, శశాంకచారి, సత్తయ్య, మధు, భరత్, రామ్, కిరణ్ పాల్గొన్నారు.